www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024
5
తిరుపతి



అంబేద్కర్ సర్కిల్లో ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి



నగర నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాలుగు వైపులా ఫ్లెక్సీలు కట్టి కనీసం విగ్రహం ముఖాన్ని చూసే అవకాశం లేకుండా చేయడం రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని దక్షిణ భారత రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు పి.అంజయ్య మండిపడ్డారు. బుధవారం నాయకులతో కలిసి వెళ్లి ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు కట్టకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనశేఖర్, చిన్నంకాళయ్య, శ్రీను, గోవిందయ్య పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు తలుపుల్లేవ్..
'మానం' పోయే..!



సత్యవేడు బాలికల పాఠశాలలో తలుపుల్లేకుండా నిర్మించిన మరుగుదొడ్లు

- విద్యార్థినుల బాధ వర్ణనాతీతం
- నిధుల్లేవన్నది హెచ్‌ఎం సమాధానం

ప్రజాశక్తి - సత్యవేడు

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ప్రతిష్టాత్మకంగా సిబిఎస్‌సి సిలబస్‌తో నిర్వహిస్తూ, ప్లస్ 1, ప్లస్ 2లుగా అప్‌గ్రేడ్ చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ, ఆటస్థలం, కిశోర బాలికలకు విశ్రాంతి గది, 16 మరుగుదొడ్ల నిర్మాణానికి కోటి 15 లక్షలను 'నాడు-నేడు' ద్వారా కేటాయించారు. సత్యవేడుకు చెందిన ఈ పాఠశాలలో మూడు గదుల నిర్మాణం అరకొరగా పూర్తయ్యింది. 16 మరుగుదొడ్ల పునర్నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే అంతా పూర్తి చేసిన కాంట్రాక్టర్ తలుపులు పెట్టడం మరిచారు. దీంతో పాఠశాలలోని 160 మంది బాలికలు మరుగుదొడ్లకు వెళ్లాలంటే తంటాలు పడే పరిస్థితి. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు వి.వాణిని వివరణ కోరగా నిధుల విడుదల్లో జాప్యం వల్ల పనులు అర్ధాంతరంగా ఆగాయన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమ సొంత నిధులతో రెండు మరుగుదొడ్లకు తలుపులు నిర్మించామని, త్వరలో నిధులు విడుదలైతే బాలికల విశ్రాంతి గది తలుపులు కూడా పూర్తి చేస్తామన్నారు.

నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - రేణిగుంట



రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ క్యాబినెట్ మంత్రి నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం లభించింది. ఎపి ఆర్ అండ్ బి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి, ఎంఎల్‌ఎలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రోటోకాల్ ఎస్‌డిసి రాంమోహన్ పాల్గొన్నారు. జాతీయ రహదారులపై అధికారులతో సమీక్షించి, మదనపల్లికు హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. బుధవారం రాత్రి తిరుమల చేరుకుని, గురువారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా ఎంపి మద్దిల గురుమూర్తి పలు రహదారుల విస్తరణపై విఐపి లాంజ్‌లో వినతిపత్రం ఇచ్చారు. బుధవారం రాత్రి తిరుమల చేరుకున్న ఆయనకు ఈవో స్వాగతం పలికారు. గురువారం తెల్లవారుజామున స్వామివారిని దర్శించుకోనున్నారు.

బీసీ హాస్టల్ సమస్యలపై ఎంపికి వినతి

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట బీసీ హాస్టల్ వీధిలైట్లు వెలగక నిర్మానుష్యంగా, వెళ్లడానికి వీల్లేకుండా ముళ్లకంపలతో నిండి ఉందని ఎస్‌ఎఫ్‌ఐ, జెవివి నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంపి మద్దిల గురుమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు ఒ.వెంకటరమణ, కుప్పస్వామి మాట్లాడుతూ రేణిగుంట బీసీ హాస్టల్‌కు వెళ్లదారి గుంతలమయమై వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రుల్లో వెళితే పడిపోక తప్పదన్నారు. మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ ఉపయోగంలో లేదన్నారు. కలుషిత నీరు తాగి అతిసార వ్యాధి బారిన పడిన విషయాన్ని వివరించారు. ఎంపి స్పందిస్తూ కొత్త ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ చైతన్య, విద్యార్థులు నరేష్, రవీంద్ర, గణేష్, సంతోష్, కార్తీక్, బాలాజీ, యువరాజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బీసీ హాస్టల్ సమస్యలపై ఎంపికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

చదువు చెప్పేదెలా 'గురూ'

28 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ప్రజాశక్తి- బిఎన్ కండ్రిగ



బిఎన్‌కండ్రిగ ఎన్‌టిఆర్ నగర్ తలారి వెట్టు పాఠశాలలో..

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని బిఎన్ కండ్రిగ మండలంలో సుమారు 28 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యాబోధన సమస్యగా మారింది. మండలంలోని గాజుల పెళ్లూరు పంచాయితీకి చెందిన ఆదిలక్ష్మి గిరిజన కాలనీ, భవానీ శంకరాపురం, చల్ల మాంబాపురం, చిన్నపాలవేడు, చిన్నాయిగుంట, కాంపాలెం, కరకంబట్టు, ఇలా చాలా ఊర్లలోని అధికారిక సమాచారం మేరకు 28 పాఠశాలలు ఏకోపాధ్యాయుడితోనే నడుస్తుండడం గమనార్హం. అత్యవసర పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు సెలవు పెట్టినా, కాస్త ఆలస్యంగా వచ్చినా విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిందే. ఒకే ఉపాధ్యాయునితో విద్యాబోధన సమస్యలు షరా మామూలేనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మెగా డిఎస్‌సి పూర్తయ్యేవరకైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు కలిపి దాదాపు 10-15 సబ్జెక్టులు ఉంటాయి. ఈ సబ్జెక్టులన్నీ ఒకే ఒక్క ఉపాధ్యాయుడు చెప్పడం ఎంతవరకూ సాధ్యమని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

విద్యార్థులకు టిటిడి డీఈవో అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి



తిరుపతిలోని టీటీడీ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు తైక్వాండో జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈనెల 14వ తేదీన తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియంలో 3వ కప్పు చిత్తూరు జిల్లా తైక్వాండో ఛాంపియన్ షిప్- 2024 జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో శ్రీ కోదండరామ, శ్రీ గోవిందరాజస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రజత, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, టీటీడీ విద్యాసంస్థల తైక్వాండో శిక్షకుడు కె.గోపి నాయుడును టీటీడీ విద్యాశాఖ అధికారి డాక్టర్ వై. నాగరాజ నాయుడు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆశీర్వదించారు.

'గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్



గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతూ ఎంఎల్‌ఎ పాశిం సునీల్‌కుమార్‌ను ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో పోలీసులు గజమాలతో సత్కరించారు. పోలీసులు మాట్లాడుతూ ఉద్యోగం రీత్యా ఏదైనా పనిమీద తిరుపతికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎంఎల్‌ఎ స్పందిస్తూ గతంలోనూ నెల్లూరు జిల్లాలో కలపాలని నియోజకవర్గ ప్రజలతో కలిసి పోరాటం చేశామన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలో పర్యటించినపుడు ఆ దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు సైతం ఎన్నికల హామీ ప్రకటించారన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయమై ప్రస్తావించి గూడూరును నెల్లూరులో కలిపేలా కృషి చేస్తానన్నారు.

పార్కులు ఆహ్లాదాన్ని పంచాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



నగరంలోని పార్కులు ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా నిర్వహణ ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని చేపల మార్కెట్, శంకర్ కాలని, మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, తిరుమల బైపాస్ రోడ్డులో గల ప్రకాశం పార్కును హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల నిర్వహణ సరిగా లేకపోవడంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. మరోసారి నిర్వహణ లోపం తన దష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఆహ్లాదం కొరకు పార్కుకు వస్తారని, నగరంలోని పార్కులు శుభ్రంగా ఉండాలని అన్నారు. చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని అన్నారు. మరుగుదొడ్లు నిర్వహణ బాగుండాలని అన్నారు. పార్కుల్లో తగినంత సిబ్బంది లేకపోవడం వల్లే నిర్వహణ సరిగా లేదని పలువురు వాకర్లు ఫిర్యాదు చేయడంతో, రిజిస్టర్ పరిశీలించి విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డిఈ లు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి ఉన్నారు.

పద్ధతి మార్చుకో..!

ఆరణిపై పవన్ ఆగ్రహం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులుపై జనసేనాని పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో జరుగుతున్న ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు అనుచర గణం వ్యవహరిస్తున్న తీరుపై కూటమి నేతల నుంచి ఫిర్యాదు అందడంతో పై విధంగా స్పందించినట్లు సమాచారం. 'పద్ధతి మార్చుకుని, కూటమిని ఐక్యంగా ఉంచాలి' అంటూ చురకలు అంటించారని తెలుస్తోంది. ఇటీవల పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఆరణి శ్రీనివాసులుకు అధినేత నుంచి చేదు అనుభవం ఎదురయ్యింది. దీంతో చేసేదేమీ లేక 'ఓకే సార్' అంటూ సెలవివ్వడం గమనార్హం.

జనసేన, బిజెపి, టిడిపి కూటమి అభ్యర్థిగా చిత్తూరు అప్పటి వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు ఊహించని పరిణామాలతో తిరుపతి తెరపైకి వచ్చారు. మూడు పార్టీలూ ఆరణి అభ్యర్థిత్వాన్ని బహిరంగంగానే వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేశాయి. ముఖ్యంగా జనసేన పార్టీలో తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ప్రత్యక్షంగా శ్రీనివాసులుపై మాటల యుద్ధానికి దిగారు. దీంతో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ రంగంలోకి దిగి కూటమిని ఏకతాటిపైకి నడిపించారు. అధినేతల జోక్యంతో ఆరణి శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో గెలుపొందాడు. 'ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా ఎన్నికలై గెలుపొందిన తరువాత ఆరణి శ్రీనివాసులు తన అనుచర గణంతో అన్ని విభాగాల్లో 'షాడో' ఎంఎల్‌ఎలను నియమించుకున్నారు. ముఖ్యంగా అన్న కుమారుడు శివకుమార్‌ను మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ నిర్వహించిన అధికారుల సమీక్షలో అధికారికంగా పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ స్థాయిలో అధికారం చెలాయించారు. పత్రికల్లో పతాక శీర్షికల్లో రావడంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. అనుచర బంధుగణాన్ని ప్రతి విభాగంలోనూ 'షాడో'లుగా కొనసాగిస్తూనే వచ్చారు. దీంతో తీవ్రస్థాయిలో విరుచుకుపడిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ మన్నూరు సుగుణమ్మతో పాటు, టిడిపి, జనసేన, బిజెపి నేతలు ఆరణి శ్రీనివాసులు తీరుపై జనసేనానికి ఫిర్యాదు చేశారు. ఆధారాలతో సహా ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విధంగా అయితే కూటమి ఐక్యత దెబ్బతింటుందని, ఎంఎల్‌ఎను సీరియస్‌గా మందలించాలని కోరారు. డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఎన్నికలకు ముందు తన ఇంటినే జనసేన కార్యాలయంగా వాడుకున్నారని, ఎంఎల్‌ఎ గెలిచాక పూర్తిగా ఆరణి శ్రీనివాసులు తనను విస్మరించారని పసుపులేటి ఆరోపణ. బిజెపి నేత భానుప్రకాష్‌రెడ్డి సైతం ఆరణిపై కస్సుమంటూనే ఉన్నారు. ఏదిఏమైనప్పటికీ తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు వ్యవహారశైలిపై జనసేనాని పవన్‌కల్యాణ్ సీరియస్ అవడం చర్చనీయాంశమయ్యింది.

సిఐటియు నూతన ఆటోస్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట



దొరవారి సత్రం, మావిళ్ళ పాడు, తల్లం పాడు, ఏకొల్లు తదితర ప్రదేశాలకు ప్రయాణ సౌకర్యార్థం సూళ్లూరుపేట పట్టణ కూరగాయలు మార్కెట్ సెంటర్ లో సిఐటియు అనుబంధ సంస్థగా పదవ ఆటో స్టాండ్‌ను బుధవారము ప్రారంభించారు. ఈ ఆటో స్టాండ్‌ను సిహెచ్.సుధాకర్ రావు సిఐటియు జెండా ఎగరవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉండి ప్రజలకు సౌకర్యంగా ఉండాలని, కార్మికుల హక్కుల కోసం పోరాడాలన్నారు. యాదచ్ఛికంగా జరిగే యాక్సిడెంట్లకు కేంద్ర ప్రభుత్వము 7 లక్షలు జరిమానా, పది సంవత్సరాలు జైలు శిక్ష అమలు చేయడం దుర్మార్గపు చర్యను అన్నారు. ఈ స్టాండుకు అధ్యక్షులుగా ఎం.గురవయ్య, కార్యదర్శిగా కే. విజయభాస్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట మండల సిఐటియు గౌరవాధ్యక్షులు కే. సాంబశివయ్య, కార్యదర్శి కే. లక్ష్మయ్య, టౌన్ కార్యదర్శి ఎస్.కే.రియాజ్, రైల్వే విశ్రాంతి ఉద్యోగ నాయకులు సుబ్బారావు, లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మయ్య, మండల ఆటో కార్మిక ఉపాధ్యక్షులు కరీమ్ పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలను ప్రజలకు వివరిస్తాం: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను వచ్చేనెల ఆగస్టు నుండి ప్రతి ఇంటికి వివరించే కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తిరుపతి టిడిపి అసెంబ్లీ బాధ్యులు మన్నూరు సుగుణమ్మ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షా 75 వేల ఎకరాల వివిధ రకాల భూమిని వివిధ రూపాల్లో కబ్జా చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గంలో 982 ఎకరాల భూమి కబ్జా అయిందన్నారు. ప్రజా సంక్షేమ పాలన అందిస్తారని ఓటేసిన ప్రజానీకానికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మోసం చేసి చూపించిందన్నారు. 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందించడానికి నెల రోజుల్లోనే ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వట్టికుంట శంకర్ నారాయణ, నాయకులు బుల్లెట్ రమణ, కంకణాల రజనీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

గోవిందధామం సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి -తిరుపతి (మంగళం)




ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన సమయంలో చనిపోయిన వారి మతదేహాలను ఎంతో సాహసోపేతంగా సాంప్రదాయ బద్ధంగా కర్మ క్రియలను నిర్వహించిన గోవిందధామం సేవలను వెలకట్టలేనివని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు కొనియాడారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని గోవిందధామం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు జి.నాగరాజు, ఉపాధ్యక్షులు ఎస్వీఎం వెంకటేష్, కోశాధికారి బి. గోపీనాథ్ రెడ్డి, సహ కార్యదర్శి ఎన్. రామశేఖర్, ఎమ్.రామ్మోహన్ రెడ్డి లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టెంకాయల దామోదరం, హేమచంద్ర, మునగ నాగేశ్వరరావు, మట్టా పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

టిటిడి పరిపాలనా భవనంలో వాకర్స్ అసోసియేషన్‌తో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ వాకింగ్ చేసిన ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులును ప్రజలు అభినందించారు. వాకర్స్ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, దేవరాజులు, కెవి రమణయ్య పాల్గొన్నారు.

నారా భువనేశ్వరితో ఎంఎల్‌ఎ నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం చంద్రగిరి మండలం, కాశి పెంట్ల వద్ద నున్న హెరిటేజ్ ఫ్యాక్టరీ వద్దకు తమ సొంత పనుల నిమిత్తం విచ్చేసిన నారా భువనేశ్వరికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ మండల నాయకులు వైకుంఠం శ్రీధర్ నాయుడు, ఏ ఈశ్వర్ రెడ్డి, నంగా బాబు రెడ్డి పాల్గొన్నారు.

లడ్డూల తయారీపై అపోహలొద్దు: టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

అనాదిగా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని శ్రీ వైష్ణవ బ్రాహ్మణులే తయారు చేస్తున్నారని, లడ్డూ తయారీపై ఎటువంటి అపోహలొద్దని టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. సోషల్ మీడియా వేదికగా టిటిడిపై అసత్య ప్రచారాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. శ్రీవారి పోటులో 980 మంది హిందూమతానికి చెందిన పోటు కార్మికులు తమకు నిర్దేశించిన వివిధ విధులను నిర్వహిస్తున్నారని తెలిపింది. ఇటీవల సోషల్ మీడియా వేదికగా శ్రీవారి లడ్డూ ప్రసాదాలను థామస్ అనే కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారని అసత్య ప్రచారాన్ని ఖండించారు. భక్తులు నమ్మరాదని కోరింది.

'ఎ2' దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఓ మీడియాలో వచ్చిన కథనంపై వైసిపి నేత విజయ్‌సాయిరెడ్డి ఖండన ఇవ్వకుండా, మీడియాపై అవాకులు చవాకులు పలకడాన్ని ఖండిస్తూ 'ఎ2' నిందితుని దిష్టిబొమ్మను దహనం చేశారు. నాలుగుకాళ్ల మండపం వద్ద జరిగిన ఘటనలో ప్రెస్‌క్లబ్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరంతో కలిసి మూకుమ్మడిగా పాల్గొన్నారు. మీడియాకు వెంటనే విజయ సాయిరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాళహస్తి గిరిబాబు, భాస్కర్, భాగవతుల శ్రీనివాసులు, కోలా లక్ష్మీపతి, చినబాబు, నాదెండ్ల ప్రసాద్ పాల్గొన్నారు.



విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలంటూ జర్నలిస్టుల నిరసన

ఘనంగా ఏజీయల్ తిరుపతి షోరూం ప్రారంభం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దేశంలోని ప్రముఖ టైల్స్ అండ్ మార్బుల్స్ కంపెనీ ఏజీఎల్ తన నూతన షోరూమ్‌ను ఆ సంస్థ ఉపాధ్యక్షులు బాలాజీ శేషాద్రి, డైరెక్టర్ భవేశ పటేల్ బుధవారం తిరుపతిలో ప్రారంభించారు. స్థానిక ఆర్ సి రోడ్డులోని తిరుపతి రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని నూతన బ్రాంచ్ వద్ద వారు విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఏజీఎల్ (ఏషియన్ గ్రానైట్ ఇండియా లిమిటెడ్) టైల్స్ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి కేంద్రంగా మొదటి షో రూమ్ ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద టైల్స్, మార్బుల్స్, క్వార్ట్జ్, బాత్ వేర్ బ్రాండ్ అందుబాటులో ఉన్నాయన్నారు. భారతదేశమంతా 235 పైగా ఎక్స్లూ షోరూమ్స్ తో , 1400 పైగా డిజైన్లు ఒకే చోట లభ్యం అవుతాయని, 100 దేశాలకు పైగా గ్లోబలైజేషన్, 14 వేలకు పైగా టచ్ పాయింట్లు, 11 ప్రదర్శన కేంద్రాల ద్వారా 6వేల మందికి పైగా కార్మికులతో నడుస్తున్న సంస్థ ఏజీఎల్ అని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, ఉత్తమ నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. ఆ బ్రాంచ్ అధినేతలు పొత్తూరు మారుతి నాయుడు , దేవేంద్ర నాయుడు మాట్లాడుతూ నేటి ఈ పోటీ ప్రపంచంలో గహోపకరాలంకరణలో సరికొత్త హంగుల కోసం ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారని, వారి అభిరుచులను దష్టిలో ఉంచుకొని ఏజీఎల్ సంస్థ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, నేటి తరం అభిరుచులను దష్టిలో ఉంచుకొని సరికొత్త మోడల్స్ తో సరసమైన ధరలకు, నాణ్యత, మన్నిక గల టైల్స్, మార్బుల్స్ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీయల్ సంస్థ ప్రతినిధులు, తిరుపతి క్రెడాయ్ కార్యవర్గం హర్ష నాయుడు, గోవర్ధన్, టిటిడి కాంట్రాక్టర్ వేణుగోపాల్ నాయుడు, శివ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

కన్నయ్య కుటుంబానికి పరామర్శ


కన్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి యువనేత కన్నయ్య కుటుం బాన్ని కొత్త గొల్ల కండ్రిగ లోని స్వగృహంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం పరామర్శించారు. మృతుని భార్య తిలకావతి ఎమ్మెల్యే ముందు 'కుటుంబ పోషకుడు చనిపోవడంతో మా కుటుంబం వీధిన పడింది.. ఇద్దరు మూగ పిల్లలు, ఒక చంటి పిల్లాడిని, నేను ఎలా బతకాలి?' అని విలపించింది. ఎమ్మెల్యే చలించి కన్నీటి పర్యంతమయ్యారు. మీ కుటుంబాన్ని పార్టీ తరపున, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నాలుగవ తరగతి చదువుతున్న హేమంత్ కుమార్‌ను టిటిడి బధిరుల పాఠశాలలో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. మృతుని భార్యకు కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇలంగోవన్ రెడ్డి, టిడిపి నాయకులు జయచంద్ర నాయుడు, ఎమ్మెస్ రవి, మునిశేఖర్ రెడ్డి, గోపి, మురళి బాబు, రమేష్ నాయుడు, గోవర్ధన్ యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవ
విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో వడమాలపేట మండలంలోని ఓ ఆలయంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. వడమాల పేట మండలం కల్లూరు గ్రామ పంచాయతీలోని ఎల్లమ్మ ఆలయానికి మూడేళ్లగా విద్యుత్ సప్లై లేదని స్థానిక విద్యుత్ అధికారులకు ఆ గ్రామస్తులు అర్జీలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే భానుప్రకాష్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ శాఖ అధికారులతో చర్చిం చారు. వెంటనే ఆ ఆలయానికి విద్యుత్‌ను సరఫరా చేశారు. సమస్యను పరిష్కరిం చినందుకు కల్లూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టు 25న టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు


క్రికెట్ లీగ్ పోటీల నిర్వహణపై చర్చిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపా ధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న రాష్ట్ర స్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఈ సంవత్సరం 18 మండలాల జట్లతో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆగస్టు 25, 26, 27, 28 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ క్రికెట్ లీగ్‌లో పాల్గొననున్న 18 మండలాల టీం కెప్టెన్స్‌తో బుధవారం సనత్ నగర్‌లోని శ్రీచైతన్య హైస్కూలులో క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో టోర్నమెంట్‌కు సంబంధించిన పలు అంశాలు చర్చించి లాటరీ పద్ధతి ద్వారా 18 టీమ్స్‌కు స్పోర్ట్స్ వేర్ కలర్స్‌ను నిర్ణయించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీచర్స్‌కు ఈ టోర్నమెంట్‌ను రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, మునిభాస్కర్, మురళి సింగ్, బాబార్, మణి పాల్గొన్నారు.

22న పుష్పయాగం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జూలై 22వ తేదీ పుష్పయాగం నిర్వహించనున్నారు. ఇందు కోసం ఈ నెల 21న సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఆలయంలో గత నెల 17 నుండి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఏవైనా లోపాలు వుంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 22న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం చేపడతారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2.40 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. ఇందులో పలు రకాల పుష్పాలతో స్వామికి అభిషేకం చేస్తారు. ఆ తర్వాత తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.


హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న గూడూరు పోలీసులు

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల సమయంలో ప్రాణాలు రక్షించుకోవచ్చని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌లు పేర్కొన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని పోటు పాలెం కూడలి వద్ద వాహనదారులకు హెల్మెట్ ఉపయోగంపై బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహన దారులు మరణిస్తుండడం చాలా బాధాకరం అన్నారు. ప్రధానంగాహెల్మెట్ ధరించక పోవడం వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని పరమాల ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి వార్షిక మహాభారత ఉత్సవాలు ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం తొలి ఏకాదశి గడియాల్లో ఉదయం 4.30 గంటల నుండి 5.30 గంటల మధ్య బ్రహ్మ ముహూర్తంలో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీ ఆధ్వర్యంలో ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్టిం చారు. అనంతరం ద్రౌపది సమేత పాండవులకి, కృష్ణుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఏకవీర సేవా ఫౌండేషన్ నిర్వాహకుల సాయంతో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రోసిరెడ్డి, ప్రవీణ్, సదా, మురగారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌వియు ఎన్‌టిఎ అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్‌వి యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ యూనియన్ తరపున గెలుపొందిన అధ్యక్షులు గుర్రంకొండ శ్రీధర్, సెక్రటరీ ఎన్ సుబ్రహ్మణ్యంలను ఎమ్మెస్ ఎఫ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎస్‌వియూలో జరిగిన బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా గెలుపొందిన వారిని సన్మానించడం ఆనందదాయకమని ఆ సంఘం నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ అంజన్ బాబు, డాక్టర్ ఆదిశేషయ్య డాక్టర్ జై చంద్రరెడ్డి, నాయకులు జూనపూడి ఎజ్రా, వైకే విశ్వనాథ్ మాదిగ, నరేంద్రబాబు, దుడ్డు రామకృష్ణ, సూరిపాక వాసుదేవరావు, పులికుంట్ల గోపి, పునభాగం వెంకటేష్, శివయ్య మాదిగ పాల్గొన్నారు.


గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేసిన రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలలో 'రోజా ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రులకు గతంలో ప్రతి బుధవారం వచ్చే గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, చిన్న పిల్లలకు తన 'రోజా ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఐదేళ్లుగా ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కెరోజా సేవలు ఆమె సేవా గుణానికి నిదర్శమని పలువురు కొనియాడారు.

కల నెరవేరింది..!

- స్పందించిన ఎమ్మెల్యే ఆదిమూలం
- గ్రామాలకు బస్సు సౌకర్యం
- నాలుగేళ్ల సమస్యకు పరిష్కారం


ప్రారంభించిన ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్న గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పందనతో ఆర్‌టిసి బస్సును ప్రారంభించారు. దీంతో నాలుగేళ్ల వారి సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామస్తులు ఎంతో ఆనందించారు.

పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండులో ' పిచ్చాటూరు – శ్రీరామపురం' ఆర్టీసీ బస్సు సర్వీసును పిచ్చాటూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ ఇలంగోవన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆ బస్సులోనే ఎమ్మెల్యే ప్రయాణించి ప్రజలను ఆకట్టుకున్నారు. పిచ్చాటూరు నుంచి శ్రీరామపురం గ్రామానికి ఆర్టీసీ సర్వీస్ నాలుగేళ్ల క్రితం ప్రయాణికులకు అందుబాటులో ఉండేది. కరోనా సమయంలో ఆర్‌టిసి అధికారులు బస్సు సర్వీసును పూర్తిగా నిలిపి వేయడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. పిచ్చాటూరు ఆర్టిసి బస్టాండ్ నుంచి శ్రీరామపురం వరకు 16 గ్రామ పంచాయతీలు వున్నాయి. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఉపాధ్యాయులకు, సచివాలయాలకు వెళ్లే అధికారులకు ఎంతో సురక్షితంగా ప్రయాణం చేసేవారు. బస్సు సర్వీసును రద్దు చేయడంతో నాలుగేళ్లుగా ఆటోలు, బైకులలో ప్రయాణం చేసి అనేకులు ప్రమాదానికి గురయ్యారు. కొందరు ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారు. రెండో సారి సత్యవేడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేటి ఆదిమూలం ప్రజా సమస్య లను గుర్తించి ఆర్‌టిసి ఉన్నత అధికారులతో మాట్లాడి నియోజక వర్గంలోని పిచ్చాటూరు –శ్రీరామపురం, నాగలాపురం– టి పి కోట మార్గంలో మూడు బస్సులను ప్రజలకు, విద్యార్థులకు బుధవారం అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఆ గ్రామస్తులు ఎమ్మెలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పద్దు రాజు, వాసు, చిన్న, సతీష్ నాయుడు, పద్మనాభం రాజు, అరుణ్ ప్రకాష్, జై చంద్ర నాయుడు, రామకృష్ణ బీవీవి రాజు, రంగనాథం, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

430 మంది టిసిఎస్‌కు ఎంపిక


ప్రాంగణ ఎంపికలో టిసిఎస్ ఉద్యోగాలకు ఎంపికైన మోహన్‌బాబు యూనివర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని ఏ రంగం పేటలోని మోహన్ బాబు విశ్వ విద్యాలయ విద్యార్థిని విద్యార్థు లు 430 మంది టిసిఎస్‌కు ఎంపికైనట్లు ఎంబీయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగరాజు రామారావు తెలిపారు. ఎంబియూలో మంగళ, బుధవారం రెండు రోజులపాటు టాటా కన్సల్టెన్సీ పరిశ్రమ ప్రతినిధులు దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంత ఎంపికలకు హాజరైన విద్యార్థులలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి మొత్తం 1800 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఒక్క ఎంబీయూ యూనివర్సిటీ నుండి 430 మంది విద్యార్థినివిద్యార్థులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని విశ్వవిద్యాలయాల ఛైర్మన్ మోహన్ బాబు అన్నారు. ఎంబియూ ప్రాంగణంలో టాటా కన్సల్టెన్సీ ప్రాంగణ ఎంపి కలు నిర్వహించినందుకు టాటా కంపెనీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన వారందరికీ మోహన్ బాబు శుభా కాంక్షలు తెలిపారు. టిసిఎస్ ప్రతినిధులకు మోహన్ బాబు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో రిజిస్ట్రారు డాక్టర్ సారథి, డాక్టర్ కె ఢిల్లీ బాబు, రవి శేఖర్, వికాస్ సింగ్ పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీకి మౌలిక వసతులు: కమిషనర్


కమిషనర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీని కమిషనర్ బుధవారం సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు నివసించే సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి కాలనీలో పర్యటించి త్వరిత గతిన మౌలిక వసతులు కల్పిస్తా మని హామీ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ సుందరయ్య కాలనీ లో మౌలి క వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్టా శంకరయ్య , సిఐటియు పట్ట ణ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలకు విసిలను నియమించండి : నారాయణ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న విసిలను త్వరగా నియమించాలని ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్నూరు నారాయణ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో దాదాపు నెల రోజుల నుండి విసిలు లేక పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో రాజీనామా చేసిన ఉపకులపతుల రాజీనామా పత్రాన్ని ఆమోదించక పోవడం, వర్సిటీలలో ఉన్నతాధికారులను నియమించక పోవడం బాధాకరమన్నారు. వర్సిటీల్లో పాలన అస్తవ్యస్తంగా అడ్డగోలుగా తయారైందని శాశ్వత అధ్యాపకులు బోధన సిబ్బంది విధులను విధులకు హాజరు కాకపోవడం విడ్డూరమన్నారు. ప్రధానంగా పరిశోధక విద్యార్థులకు యుఆర్‌సి, పీహెచ్‌డి వైవాలు నిర్వహించకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి వర్సిటీల పరిపాలనలో బోధన, పరిశోధన, అనుభవం కలిగిన నీతి నిజాయతీ కలిగిన సీనియర్ ఆచార్యులను విసిలుగా నియమించి రాష్ట్రంలోని విషయ విద్యాలయాల ఉన్నత విద్యను, పరిపాలన గాడిలో పెట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బక్రీద్ తరువాత ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ మొహరం మంచితనానికి త్యాగానికి నిరతిగా మొహరంను బుధవారం ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ, నీర్పాకోట, కాటూరు, సల్లమాల కండ్రిగ గ్రామాలతో పాటు కంచన పుత్తూరు, గాజుల పెళ్లూరు గ్రామాలలో ఉన్న మసీదులు, దర్గాలలో పది రోజులుగా పీర్లను ఊరేగించి మొహరం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు హిందూ సోదరులను ఆలింగనం చేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా మాజీ ఎంపిపి జన్మదిన వేడుకలు


మాజీ ఎంపిపి గంజి మాధవయ్యను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండల మాజీ ఎంపిపి, చిత్తూరు పార్ల మెంటు టిడిపి ఉపాధ్యక్షు లు గంజి మాధవయ్య జన్మదినాన్ని పురస్కరిం చుకుని పుత్తూరు రూరల్ మండలం , పట్టణ టిడిపి శ్రేణులు ఆయన్ను బుధవారం భారీ గజమాలతో సత్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు చెరుకుల కరుణా యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎన్ ధనపాల్, తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్, మాజీ ఎంపిటిసిలు కోట గజపతి, ఆదిమందడి, కవిత, ఆదిలక్ష్మి, పిఆర్ మంగళం సింగిల్ విండో మాజీ ప్రసిడెంట్ శేఖర్ నాయుడు, మాజీ సర్పంచ్ వాజ్‌పాయ్, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తిశెట్టి మృతి తీరని లోటు: టిడిపి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీలో సీనియర్ నాయకుడు, కాట్రపల్లి నీటి సంఘ మాజీ అధ్యక్షుడు రామ్మూర్తి శెట్టి మృతి పార్టీకి తీరని లోటు అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతదేహంపై టిడిపి జెండా కప్పి ఘన నివాళి అర్పించిన టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మునుస్వామి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఆయన ఎంతో అంకిత భావంతో పనిచేస్తూ ఆనాటి ఎమ్మెల్యే మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, అప్పటి మండల అధ్యక్షులు అవసరం బాలకృష్ణ రెడ్డి ఎంతో సన్నిహితంగా ఉంటూ కాట్రపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ కమిటీ అధ్యక్షులుగానూ, ఆయకట్టు ఛైర్మన్ గానూ, మండల రైతు కమిటీలోనూ ప్రజలకు సేవలందించి, మండలంలో మొదట మెడికల్ షాప్ తీసుకొని వచ్చి ప్రజలకు ఎంతో సేవ చేసిన గొప్ప నాయకుడు రామ్మూర్తి శెట్టి అని కొనియాడారు. ఈ సందర్భంగా కెవిబిపురం మండల మాజీ వైస్ ఎంపీపీ కిరణ్ యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీహరి యాదవ్, సీనియర్ నాయకులు కర్రయ్య, ఒళ్లూరు గ్రామపంచాయతీ సర్పంచ్ సురేష్ చౌదరి, పాల ఏకరి సాధికార తిరుపతి జిల్లా అధ్యక్షుడు వెంకట కృష్ణయ్య , యువ నాయకుడు కరుణ్ శేఖర్, కాట్రపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణ, బాలయ్య, వెంగనాథం, కిరణ్ రాయల్, నివాళులు అర్పించారు.

సంఘమిత్రలకు అండగా నిలవండి


సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సంఘమిత్రలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దశాబ్దాల తరబడి ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధులుగా పనిచేస్తూ అణగారిన వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న సంఘమిత్రులకు ప్రభుత్వం అండగా నిలవాలని సిఐటీయూ అనుబంధ సంఘమిత్రల సంఘం నాయకులు గెడి వేణు అన్నారు. బుధవారం రాత్రి సంఘమిత్రల సంఘం నాయకులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘమిత్రల సమస్యలను తెలిపి వేతనాలు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం మారగానే నియోజకవర్గంలో కొన్ని పంచాయితీల్లోని సంఘమిత్రలపై అక్కడక్కడా రాజకీయ వేధింపులు వస్తున్నాయి వాటిని అరికట్టి మద్దతుగా నిలవాలని కోరారు. ముఖ్యంగా సంఘమిత్రులుగా విధులు నిర్వర్తిస్తున్న వారిలో అత్యధికులు దళితులేననీ, వారి పొట్ట కొట్టే రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ మిత్రలు పాల్గొన్నారు.

వైభవంగా మధు ప్యారడైజ్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మధు పేరడై బిర్యాని కేంద్రాన్ని తిరుపతి ఎమ్మెల్యే ఆరిని శ్రీనివాసులు బుధవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక తిరుమల బైపాస్ రోడ్డు , మున్సిపల్ పార్క్ వద్ద జనసేన రాష్ట్ర నాయకులు బత్తిన మధుబాబు లిఎంసిలి మధు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు మధు ఇలాంటి హోటల్ ఏర్పరిచినట్లు తెలిపారు. దీనికి ప్రతి ఒక్కరూ సభ్యులను చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఆ హోటల్ అధినేత మధుబాబు మాట్లాడుతూ దేశ విదేశాలను తిరుపతి కి వచ్చే యాత్రికలను దృష్టిలో ఉంచుకొని, వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఉద్దేశంతో ఈ హోటల్ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతికి వచ్చే ప్రతి యాత్రికుడు ఆకలితో పోకుండా సంతృప్తికరమైన భోజనం చేయాలన్నారు. గత అనేక సంవత్సరాలగా క్యాటరింగ్ రంగంలో తిరుపతిలో వివిధ కార్యక్రమాలకు నాణ్యమైన ఆహారాన్ని క్యాటరింగ్ ద్వారా సరఫరా చేశామని తెలిపారు. తిరుపతి ప్రజల మనల్ని పొందిన తాము ఇప్పుడు బిర్యానీ ప్యారడైని కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరి రుచులు తగ్గట్టుగా నాణ్యమైన రుచికరమైన శుభ్రమైన ఆహారం ఇక్కడ లభిస్తుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి ధనుష్, లక్ష్మి, వల్లి, సాయినాథ్, కోలా ఆనంద్ , రాజారెడ్డి , పొలకల మల్లికార్జున్ , అన్నా అనిత , నవీన్ కుమార్ రెడ్డి , కీర్తన , కిరణ్ రాయల్ , సుమన్ రాయల్, సైకం జై చంద్ర రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్


ముళ్ల పొదల్లో మృతదేహమై కనిపించిన బాలిక

అత్యాచారమా.. హత్యా?

- అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి
- పోలీసుల అదుపులో అనుమానితుడు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారి సత్రం మండల పరిధిలోని నెల బల్లి గ్రామ సరిహద్దులోని రైస్ మిల్ అడవి పొదల్లో ఎనిమిదేళ్ల బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చెన్నై –కలకత్తా జాతీయ రహదారి పక్కనే రైస్ మిల్ సాగుతోంది. ఆ యజమాని మిల్లులో పనిచేసేందుకు బీహార్ రాష్ట్రానికి చెందిన పలువురిని కూలీలుగా పనిచేసే నిమిత్తం తీసుకువచ్చారు. వారికి వంట వార్పు చేసేందుకు లాలూక్ (32)ను వంట మాస్టర్‌గా ఏర్పాటు చేసుకున్నారు. ఇతనికి ఎనిమిదేళ్ల వయసు కలిగిన కుమార్తె వుంది. ఆ చిన్నారి కనిపించక పోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. చివరకు చెట్ల పొదల్లో మృతి చెందిన పాపను కనుగొన్నారు. చనిపోవడానికి కారణాలేమని ఊహించిన వారికి అంతుపట్టలేదు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారి నుండి వివరాలు సేకరించారు. సిసి ఫుటేజ్ పరిశీలించడంతో కూలీ పనికి వచ్చిన బీహార్ యువకుడు దిలీప్(21) సుమారు ఉదయం 10 గంటల సమయంలో చేయి పట్టుకుని మృతదేహం పడి వున్న ప్రాంతం వైపు తీసుకు వెళ్లినట్లు గుర్తించారు. అతడు గంజాయి మత్తులో ఉన్నట్లు కూలీలు ఆరోపిస్తున్నారు. అక్కడ పరిస్థితులు చూసి చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి పాల్పడి ప్రాణం తీసి ఉంటాడని పలు అనుమానాలకు తావిస్తోంది. దిలీప్ పలుమార్లు మత్తులో ఉంటున్నట్లు బీహార్ కూలీలు పేర్కొంటున్నారు. అభం శుభం ఎరుగని ఎనిమిదేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడి చంపేసి ఉంటాడని ఆ గ్రామస్తులు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై నాయుడుపేట డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ జగన్మోహన్ రావు, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎస్ఐ తిరుమలరావులు బాలిక మృతి కి గల కారణాలను పలు కోణాల్లో పరిశీలించి విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ద్వారా దిలీప్ దీనికి బాధ్యుడై ఉంటాడని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. బాలిక మృత దేహాన్ని నాయుడుపేట సామాజిక వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట రైల్వే ట్రాక్‌పై ఓ గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందిన సంఘటన రేణిగుంట మండలంలో చోటుచేసుకుంది. రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఉదయం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి చనిపోయాడు. ఆ వ్యక్తి పాచి కలరు బనియన్, కుడి చేయిపై కుమార్ , చెన్నప్ప పచ్చబొట్టు వేసి వుంది. మృతదేహాన్ని గుర్తింపు కోసం తిరుపతి మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించారు. తెలిసిన వారు ఎస్ఐ కె.రవికి తెలపాలని, ఫోను నెంబరు 9963126343కు తెలపాలని వారు కోరారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- డక్కిలి: వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక , ఎంఆర్పీఎస్‌ల ఆధ్వర్యంలో డక్కిలి మండలంలోని కందలవారిపల్లి లో గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రజాసంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు గద్దల మునియ్య, ఎంఆర్పీఎస్ నాయకుడు ఎం సురేష్ మాదిగ , స్థానిక టిడిపి నాయకుడు తన్నీరు వెంకటేశ్వర్లు విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం


ఎమ్మెల్యే రామకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - బాలాయపల్లి : వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగుండ్ల రామ కృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రం లోని టిడిపి కార్యా లయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఆ పార్టీ నాయకు లు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భం గా మండల నాయకులు సత్యం నాయుడు, రామచంద్ర నాయుడు, కూను శ్రీహరి , కోటేశ్వరరావు, బాలాయపల్లి మండలం లోని కాట్రగుంట పంచాయతీ లోని కొత్తూరు, తిక్కవరం, అరిగేపల్లి, కరిమేనుగుంట, కాట్రగుంట పాల్గొన్నారు.